833) శంకరాభరణం

ప॥ ఎంత వడేయ నిదేమమ్మా । దొంతిరతులకు నెదురు చూచీని ॥

చ॥ అలికులవేణి అంబుజపాణి । కలికిమగువ రాగదవమ్మా ।
మలయజగంధి మదన విలాసిని । కలయికకు పతిగాచుకున్నాడు ॥

చ॥ సామజగమనా చక్కెరబొమ్మా । కామిని యిక రాగదవమ్మా ।
భూమాతిలకమ పసిడి సలాకా । నీమగడదివో నిలుచుకున్నాడు ॥

చ॥ వొడికపు నెలతా వొప్పుల కుప్పా । కడకల సతి రాగాదవమ్మా ।
గుడిగొని తెరలో గూడెనిన్నప్పుడు । యెడయక శ్రీవేంకటేశుడున్నాడు ॥